E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD    సంపుటి :01    సంచిక :193    సోమవారం 22 జూన్ 2026    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 04    వెల :05/-

## బీజేపీ, కాంగ్రెస్ మధ్య లెటర్ వార్

### రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోసం సీఎంకు బీజేపీ లేఖ


2 లో

**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ రాజకీయం ఆసక్తి రేపుతోంది. అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీజేపీ మధ్య లేఖల యుద్ధం సంచలనంగా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సహకరించడం లేదని ఆరోపిస్తూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖలు రాస్తుండగా బీజేపీ సైతం అదే స్థాయిలో కౌంటర్ ఇస్తోంది.తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు రాసిన లేఖ రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

కిషన్ రెడ్డి వర్సెస్ సీఎం: గత కొంతకాలంగా రాష్ట్ర రాజకీయాల్లో సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని టార్గెట్ చేయడం ఆసక్తిగా మారింది. తెలంగాణ అభివృద్ధికి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని, రాష్ట్రానికి రావాల్సిన పలు ప్రాజెక్టులను తనకున్న పలుకుబడిని ఉపయోగించి అడ్డుకుంటున్నారని సీఎం ధ్వజమెత్తారు.

# తెలంగాణ కొత్త చీఫ్ సెక్రెటరీ ఎవరు?

## ఆ ముగ్గురి మధ్యే ప్రధాన పోటాపోటీ!

**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** ఈ నెలాఖరుతో చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు పదవీకాలం ముగియనుంది. ఆయన సర్వీసును మరోసారి పొడగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరినట్టు తెలిసింది. ఇప్పటికే రెండు సార్లు ఆయన పదవీకాలాన్ని కేంద్రం పొడిగించడంతో, మరోసారి ఎక్స్‌టెన్షన్ లభిస్తుందా? లేదా? అనే ఉత్కంఠ నెలకొన్నది. రామకృష్ణారావుకు ఎక్స్‌టెన్షన్ లభించకపోతే.. ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు ముగ్గురు స్పెషల్ సీఎస్‌ల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నది. ఆ జాబితాలో జయేశ్ రంజన్, వికాజ్ రాజ్, సంజయ్ జాజు ఉన్నారు. ఈ ముగ్గురూ 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులు. సీనియార్టీలో మొదటి వరుసలో ఉన్న తనకు పదవి కచ్చితంగా వస్తుందని అంచనాలో జయేశ్ రంజన్ ఉండగా, తన సిన్సియార్టీనే తనకు చీఫ్ సెక్రెటరీ పదవి తెచ్చిపెడుతుందని వికాస్ రాజ్ ధీమాలో ఉన్నట్టు తెలిసింది. మరోవైపు కేంద్ర సర్వీసులో ఉన్న సంజయ్ జాజు సైతం చీఫ్ సెక్రెటరీ పదవిని దక్కించుకునేందుకు ఢిల్లీలోని ఏఐసీసీ నేతల ద్వారా లాబీయింగ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది.


2 లో

# గ్రేటర్‌పై జనసేన గురి

- తెలంగాణపై పవన్ ఫోకస్
- జీహెచ్ఎంసీకి జనసేన సన్నాహాలు
- అలర్ట్ అయిన ప్రధాన పార్టీలు
- సెటిలర్ల ఓట్లపై గురి
- పొత్తులపై జోరుగా చర్చ
- యువ ఓటర్లే లక్ష్యం
- కింగ్‌మేకర్‌గా జనసేన?
- పవన్ ఎఫెక్ట్ ఎంత?
- బీజేపీతో మళ్లీ జట్టు?
- కాంగ్రెస్‌తో మాటల యుద్ధం
- సభ వివాదం రాజకీయ వేడి
- హైదరాబాద్‌లో ఎన్నికల హడావిడి
- బల్దియాపై పార్టీల ఫోకస్
- బహుముఖ పోరుకు రంగం సిద్ధం
- హాట్ టాపిక్‌గా జీహెచ్ఎంసీ పోరు



**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** తెలంగాణలో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభంతో జీహెచ్ఎంసీ ఎన్నికల వేడి మొదలైంది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో సాధించిన ఘనవిజయం ఇచ్చిన ఉత్సాహంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణ రాజకీయం పై పూర్తి దృష్టి పెట్టి ఇటీవల మణికొండలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఇప్పట్లో లేనప్పటికీ మరి కొన్ని నెలల్లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ ను జీహెచ్ఎంసీ , సీఎంసీ, ఎంఎంసీ ఇలా మూడు కార్పొరేషన్లు విభజించడంతో పాటు గతంలో ఉన్న 150 డివిజన్లను 300 లకు పెంచగా ఈ ఎన్నికలను టార్గెట్ చేసి మెజార్టీ కార్పొరేటర్ స్థానాలు గెలుచుకోవడం పైనే పార్టీ అధినేత సమాయత్తం అవుతున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి . బల్దియాలో బలాన్ని మూటగట్టుకుని శాసనసభ ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన లో ఉన్నప్పటికీ ఇప్పటికే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లు పవన్ కళ్యాణ్ ఎత్తులను ఎలా చిత్తు చేస్తాయనేది చర్చనీయాంశంగా మారింది . హైదరాబాద్ నగర పరిధిలో జనసేన పార్టీ ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా లేదా కింగ్ మేకర్‌గా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పవన్ కల్యాణ్‌కు ఉన్న క్రేజ్, యువతలో ఉన్న ఆదరణను ఓట్లుగా మలుచుకోవడానికే ముందుచూపుతో సాగుతున్నారని , గ్రేటర్ పరిధిలోని మెజారిటీ స్థానాల్లో కుదిరితే ఏపీ మాధిరిగా పొత్తు, లేకపోతే ఒంటరిగానైనా పోటీ చేసేందుకు పార్టీ సిద్ధమవుతోందని టాక్ వినబడుతోంది. 2020 ఎన్నికల్లో జనసేన సుమారు 60 కి పైగా స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని భావించినప్పటికీ ఆఖరి నిమిషంలో బీజేపీ అగ్రనాయకత్వంతో జరిగిన చర్చల తర్వాత ఓట్లు చీలకూడదనే ఉద్దేశంతో పవన్ కల్యాణ్ తమ అభ్యర్థులను పోటీ నుంచి ఉపసంహరించుకున్నారు. పోటీ నుంచి తప్పుకున్న తర్వాత జనసేన పార్టీ బీజేపీ అభ్యర్థుల విజయానికి మద్దతుగా నిలవడం తో ఆ పార్టీ ఏకంగా 48 డివిజన్లను గెలుచుకో కలిగింది .

మిగతాది 2 లో..

## కాక్రోచ్ పార్టీ పోరాటానికి రైతుల మద్దతు?


### జంతర్ మంతర్ నుండి సీజేపీ చీఫ్ కీలక పిలుపు


2 లో

## సగం సినిమా అయిపోయింది: కేటీఆర్


2 లో

## బీజేపీ నా సీటు చోరీకి పాల్పడింది



2 లో

**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** బీజేపీ నిర్దాక్షిణ్యంగా తన రాజ్యసభ సీటు చోరీకి పాల్పడిందని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. ఆదివారం గాంధీభవన్‌లో పీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో భాగంగా ఎస్ఐఆర్‌పై పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జిలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని అన్నారు.

## నేను హోం మినిస్టర్ కాదు.. అది క్రిమినల్స్ అదృష్టం..

## లా అండ్ ఆర్డర్‌పై పవన్ ఘాటు వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాను హోం మంత్రి కాదని, లా అండ్ ఆర్డర్ తన పరిధిలో లేదని పేర్కొంటూనే, రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా బలంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నేరస్తులను కుల కోణంలో చూడకూడదని, క్రిమినల్స్‌కు కులం ఉండదని స్పష్టం చేశారు.. అయితే, నేను హోం మినిస్టర్ కాకపోవడం.. లా అండ్ ఆర్డర్ తన పరిధిలో లేకపోవడం క్రిమినల్స్ అదృష్టమని పేర్కొన్నారు..

'గుండాలకు గట్టిగా సమాధానం చెబుతాం'

గత రెండేళ్లుగా సహనంగా వ్యవహరించానని చెప్పిన పవన్ కల్యాణ్, ఇకపై గుండాలు, నేరగాళ్ల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తానని హెచ్చరించారు. ఒక తల్లి తన బిడ్డ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన ఘటనను ప్రస్తావిస్తూ, బాధితుల హక్కులను కూడా గుర్తించాలని అన్నారు. ప్రతి సంఘటనకు కులాన్ని ముడిపెట్టడం సరైన


2 లో

విధానం కాదని పవన్ విమర్శించారు. సమాజాన్ని విభజించే కుల రాజకీయాలు రాష్ట్రానికి హానికరమని పేర్కొన్నారు. తాను ఎప్పుడూ కుల గొడవలను ప్రోత్సహించలేదని, తనను కుల చట్రంలో బంధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

## కులాన్ని తక్కువగా చూడొద్దు వంగా గీత రిక్వెస్ట్


2 లో

**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** ఏపీ రాజకీయాల్లో ఇటీవల కుల ప్రస్తావన వినిపిస్తోంది. ముఖ్యంగా కూటమిలో జనసేన పార్టీ ఉండటం, పవన్ కల్యాణ్ కాపు వ్యక్తి కావడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆయన్ను టార్గెట్ చేసింది. దీంతో తనకు కులాన్ని ఆపాదించొద్దని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. తాను ప్రాంతాలకు కూడా అతీతమని బహిరంగ సభల్లోనూ స్పష్టం చేశారు. అయినా సరే వైసీపీ మాజీ నేతలు అమర్‌నాధ్, అంబటి రాంబాబు, వంగా గీత లాంటి వ్యక్తులు పవన్ కల్యాణే టార్గెట్‌గా కుల విమర్శలు చేస్తున్నారు.

# బీజేపీ, కాంగ్రెస్ మధ్య లెటర్ వార్..

## రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోసం సీఎంకు బీజేపీ లేఖ

మొదటి పేజీ తరువాయి



ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు అంతే ఘాటుగా కిషన్ రెడ్డి సైతం స్పందిస్తున్నారు. దీంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం రాజకీయాన్ని మరింత రక్తికట్టిస్తున్న వేళ ఇప్పుడు లేఖల రాజకీయం ఇంట్రెస్టింగ్ గా మారింది. మేడిగడ్డ విషయంలో చర్చించేందుకు మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఇదివరకే కిషన్ రెడ్డికి లేఖ రాయగా మొన్న మరోసారి లేఖ రాస్తూ.. ఈసారి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. తాను ఈ నెల 22,23 తేదీల్లో ఢిల్లీలోనే ఉంటానని ఆ సమయంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో సమావేశం కోసం అపాయింట్మెంట్ ఇప్పించాలని కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

ముందు రాహుల్ గాంధీ అపాయింట్మెట్ ఇప్పించు:

కిషన్ రెడ్డిపై లేఖాస్త్రాలు ప్రయోగిస్తున్న వేళ తెలంగాణ బీజేపీ సైతం అంతే స్ట్రాంగ్ గా కౌంటర్ ఇస్తోంది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై చర్చించేందుకు రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ ఇప్పించాలని కోరుతూ సీఎంకు లేఖ రాశారు. కాంగ్రెస్ నాయకులు హామీలు ఇచ్చేటప్పుడు తప్ప .. తీర్చేటప్పుడు పత్తా లేరా అని ప్రశ్నించారు. 2023 ఎన్నికల్లో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ స్వయంగా తెలంగాణకు వచ్చి ఇచ్చిన గ్యారంటీలు ఏమయ్యాయి? ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులైనా.. మహిళలకు నెలకు రూ.2,500, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15,000, విద్యార్థులకు విద్యా భరోసా అందలేదన్నారు. నిరుద్యోగులకు రూ.4,000 భృతి అతీగతీ లేదని వృద్ధులకు రూ.4,000 పెన్షన్ దక్కలేదని విమర్శఇంచారు. ఈ నెరవేరని వాగ్దానాలపై రాహుల్ గాంధీకి వినతిపత్రం ఇచ్చేందుకు అపాయింట్‌మెంట్ ఇప్పించాలని సీఎం రేవంత్ రెడ్డిని బహిరంగ లేఖ ద్వారా డిమాండ్ చేస్తున్నానని పేర్కొన్నారు. ఒకవేళ అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి కాంగ్రెస్ నాయకత్వం భయపడితే.. అది తెలంగాణ ప్రజలను వారు ఘోరంగా వంచించారని ఒప్పుకున్నట్లేనన్నారు.

# కులాన్ని తక్కువగా చూడొద్దు: వంగా గీత రిక్వెస్ట్

మొదటి పేజీ తరువాయి

కుల ప్రస్తావన చేసిందే పవన్ కల్యాణ్: తాజాగా సైతం కాపు ప్రస్తావన వచ్చేలా మాట్లాడారు. రాజకీయాల్లో చాలాసార్లు కుల ప్రస్తావన చేసిందే పవన్ కల్యాణ్ అని మాజీ మంత్రి అమర్ నాథ్ అన్నారు. భీమవరం, గాజువాక ఎన్నికల సమయంలోనూ కులం అంశాలను పవన్ ప్రస్తావించారని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్నందున ఏం మాట్లాడినా చెల్లుతుందని అనుకుంటున్నారని గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు.

మరో నేత అంబటి రాంబాబు సైతం పవన్ కల్యాణ్ పై సెటైర్లు వేశారు. గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి ఆయన వ్యంగాస్త్రాలు సంధించారు. పవన్ కల్యాణ్ తోలు తీస్తామంటే తీయమనండి చూద్దామని అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు.

కులం పుట్టుకతో వస్తుంది...

పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్‌తో బరిలోకి దిగి ఓడిపోయిన వంగా గీత సైతం విమర్శలు కురిపించార. కులం పుట్టుకతో వస్తుందని, తక్కువగా చూడొద్దని సూచించారు. అధికారంలోకి ఉన్నా లేకపోయినా పవన్ కల్యాణ్ ఒకేలా ఉంటామంటే ఎలా అని వంగా గీత ప్రశ్నించారు. పిఠాపురంలో అన్ని కులాల వారు ఓట్లు వేస్తేనే ఆయన గెలిచారని, ఒక పవన్ కల్యాణ్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని వంగా గీత సూచించారు.

# సగం సినిమా అయిపోయింది: కేటీఆర్



**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ నేతలు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అంతా మాఫియా రాజ్యం నడుస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ దండుపాళ్యం బ్యాచ్‌కు రేవంత్ రెడ్డి అధ్యక్షుడు అయ్యాడని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో వేల ఇళ్లు కూల్చేశారని అన్నారు. రేవంత్ రెడ్డికి బూతులు మాట్లాడటం, కేసులు పెట్టడం తప్ప ఏమీ తెలియదని విమర్శించారు. రాష్ట్రం బాగుపడాలి అంటే కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి అని నినదించారు. మొత్తం తెలంగాణ ప్రజలు అందరూ ఇదే కోరుకుంటున్నారని గుర్తుచేశారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని.. ఈ విషయం ప్రజలు అందరికీ తెలిసిపోయి విసుక్కుంటున్నారని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సినిమా సగం అయిపోయిందని, ఇంకా సగమే ఉందని తెలిపారు. రేవంత్ రెడ్డి సినిమా అట్టర్ ఫ్లాప్ అని ఎద్దేవా చేశారు. ఎక్కడైనా ఒక సినిమా ఫెయిలైతే నిర్మాత ఒక్కరే నష్టపోతారు.. కానీ రేవంత్ రెడ్డి సినిమాలో మొత్తం తెలంగాణ ప్రజలు అందరూ నష్టపోతున్నారని అన్నారు. నియోజకవర్గంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ఒక్క ఇందిరమ్మ ఇల్లు అయినా కట్టించారా? అని ప్రశ్నించారు.

# బీజేపీ నా సీటు చోరీకి పాల్పడింది..

## మీనాక్షి నటరాజన్ సెన్సేషనల్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి



ప్లాన్ ప్రకారమే తన నామినేషన్ వెంటనే తిరస్కరించారని మీనాక్షి నటరాజన్ ఫైర్ అయ్యారు.

నామినేషన్ తిరస్కరణ విషయంలో తనకు వివరణ కూడా ఇచ్చే సమయం ఇవ్వలేదని మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. జార్ఖండ్ లో బీజేపీ అభ్యర్థి పరిమళ్ సత్వాని కి మాత్రం అన్ని విషయాలపై వివరణ ఇచ్చేందుకు టైమ్ ఇవ్వడం అన్యాయం కాదా.. అని ప్రశ్నించారు. ఏదైనా ఫిర్యాదు వస్తే తన వివరణ తీసుకోవాలని, పరిమళ్ నత్వానికి ఒక రూల్, తనకు ఒక రూలా అని మండిపడ్డారు. నారాయణ పేటలో మహిళ ఆరోపణలపై వెంటనే చర్యలు తీసుకున్నామని అన్నారు. మహిళ ఆరోపణల కేసు అప్పుడు ముగిసిపోయిందని తెలిపారు. సిల్లీ రీజన్ చూపి తనకు రాజ్యసభ ఎంపీ రాకుండా చేశారని ధ్వజమెత్తారు. బీజేపీ తన సీట్ చోరీకి పాల్పడిందని, ఎన్నికల కమిషన్ కూడా కాంప్రమైజ్ అయిందని మీనాక్షి నటరాజన్ తీవ్ర ఆరోపణలు చేశారు.

# కాక్రోచ్ పార్టీ పోరాటానికి రైతుల మద్దతు?

## జంతర్ మంతర్ నుండి సీజేపీ చీఫ్ కీలక పిలుపు



**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** నీట్ ఎగ్జామ్ అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్?తో కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ధర్నా రెండవరోజు కొనసాగుతోంది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆదివారం సైతం తమ నిరసన కంటిన్యూ చేస్తున్నారు. ఈ సందర్భంగా సీజేపీ పార్టీ చీఫ్ అభిజిత్ దిప్కే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాము చేపట్టిన ఈ ఆందోళనకు దేశవ్యాప్తంగా ఉన్న రైతులు, కార్మికులు మద్దతు ఇవ్వాలని కోరారు. గతంలో రైతులు చేపట్టిన ఆందోళనకు దేశంలోని యువత మద్దతు ఇచ్చిందని ఇప్పుడు మీ పిల్లల హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటానికి మద్దతు ఇవ్వాలన్నారు. నీట్ పరీక్ష నిర్వహణ వైఫల్యం కారణంగా ఇప్పటి వరకు 12 మందికి పైగా పిల్లలు ఆత్మహత్యలు చేసుకున్నారని దయచేసి జంతర్ మంతర్ వద్దకు వచ్చి మాకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఢిల్లీలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులంతా ఇవాళ మీ ఆదివారాన్ని ఈ ధర్నా కోసం కేటాయించాలని పిలుపునిచ్చారు. నీట్ ఎగ్జామ్ అనంతరం విద్యార్థులు సైతం ధర్నాకు అండగా తరలి రావాలన్నారు.

పోలీసులు సహకరించాలి:

సీజేపీ ధర్నాకు శనివారం సాయంత్రం 5 గంటల వరకే అనుమతి ఉందని దీంతో వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఢిల్లీ పోలీసులు శనివారం రాత్రి ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించే వరకు తాము జంతర్ మంతర్ నుండి కదిలేది లేదని అభిజీత్ దిప్కే స్పష్టం చేశారు. రాత్రి సమయంలో నిరసన స్థలంలో లైట్లు ఆపేశారని, తాగునీరు, వాష్‌రూమ్ సౌకర్యాలు నిలిపివేశారని ఆందోళనకారులు ఆరోపించారు. ఆ తర్వాత నీటి సరఫరా, విద్యుత్ పునరుద్ధరించినట్లు తెలిపారు. పోలీసులు ప్రజలను ఆందోళన స్థలానికి రాకుండా అడ్డుకోవద్దని, విద్యార్థుల ఆత్మహత్యలకు న్యాయం జరగాలనే తాము శాంతియుతంగా పోరాడుతున్నామని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కోరారు.

27న నిరాహార దీక్ష:

ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఈ నిరసనకు సంఘీభావం ప్రకటించారు. జూన్ 27 లోగా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే తాను నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.

# గ్రేటర్‌పై జనసేన గురి

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్ మహానగరంలో అన్ని ప్రతిష్టాత్మకంగా భావించే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సెటిలర్ల ఓట్లు కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా కుతుబుల్లాపూర్ , శేరిలింగంపల్లి, కూకట్ పల్లి , ఎల్బీ నగర్ , జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో సెటిలర్లు అధికంగా ఉంటారు. వీటి ఓట్లపై జనసేన గురి పెట్టినట్లుగా చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో ఏపీలో మాదిరిగా టీడీపీ, బీజేపీలతో కలిసి నడుస్తారనే టాక్ సైతం వినబడుతోంది . అయితే తమిళనాడు మాదిరిగా పవన్ కళ్యాణ్ సినీ మంత్రం పనిచేస్తుందా? ఇది ఎంతవరకు రాజకీయంగా ఉపయోగపడుతుందనేది చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం 2014లో కేవలం రాజకీయ లాభం కోసమే, పార్లమెంట్ తలుపులు మూసి వేసి, చాలా తొందరపాటుగా, అనాలోచితంగా రాష్ట్రాన్ని విభజించిందని పవన్ కళ్యాణ్ విమర్శించారు. రెండు ప్రాంతాల ప్రజల మధ్య సయోధ్య కుదర్చకుండా విభజించడం వల్లే సమస్యలు వచ్చాయని ఆయన వాదించారు. ఇటీవల ఢిల్లీలో తాను తెలంగాణకు వ్యతిరేకం కాదు, విభజన తీరుకు వ్యతిరేకం అని పవన్ కళ్యాణ్ అన్నారు. వీటి ప్రభావం జీహెచ్ఎంసీ ఎన్నికలపై ఎంత వరకు ఉంటుంది? అభిమానం ఓట్లు రాలుస్తుందా? పొత్తులు ఎవరెవరితో ఉంటాయి? అనేది రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది

సభకు అనుమతి నిరాకరణతో..

ఈ నెల ప్రారంభంలో హైదరాబాద్‌లో జనసేన పార్టీ నిర్వహించాలనుకున్న 'తెలంగాణ నవనిర్మాణ సంకల్ప సభ'కు కాంగ్రెస్ ప్రభుత్వం (సైబరాబాద్ పోలీసులు) అనుమతి నిరాకరించడం రెండు పార్టీల మధ్య తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో సుమారు 2 వేల మందితో ఇండోర్ సమావేశం పెట్టాలని జనసేన భావించింది. కానీ శాంతిభద్రతల సమస్యలు, ట్రాఫిక్ ఇబ్బందులను సాకుగా చూపుతూ పోలీసులు పర్మిషన్ ఇవ్వలేదు. దీనిపై జనసేన కోర్టుకు వెళ్లినా ఫలితం దక్కలేదు. ఈ పరిణామం తర్వాత జనసేన అధినేత పవన్ కల్యాణ్, తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర స్థాయిలో తెలంగాణ మీ అయ్య సొత్తా అంటూ మాటల యుద్ధం నడిచింది.

పోటీకి సై అంటున్న పార్టీలు..

జీహెచ్ఎంసీలో గతంలో జరిగిన ఎన్నికల్లో పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంల మధ్య నడిచింది. మారిన రాజకీయ పరిస్థితుల్లో ఈ పర్యాయం కల్వకుంట్ల కవిత టీఆర్ఎస్ తో పాటు జనసేన , టీడీపీ కూడా పోటీ చేసే అవకాశం ఉండటంతో ఈ పర్యాయం పోటీ హాట్ హాట్ గా, రసవత్తరంగా ఉంటుందనే టాక్ నడుస్తోంది . మొత్తం హైదరాబాద్ మహానగరంలో క్రమంగా జీహెచ్ఎంసీ ఎన్నికల వేడి రాజుకుంటుండగా ఓటర్లు కూడా అన్ని పార్టీలను ఆసక్తిగా గమనిస్తున్నారు.

# తెలంగాణ కొత్త చీఫ్ సెక్రెటరీ ఎవరు?

## ఆ ముగ్గురి మధ్యే ప్రధాన పోటాపోటీ!

మొదటి పేజీ తరువాయి



చాలా ఏండ్లుగా కేంద్ర సర్వీసులో పనిచేస్తోన్న జాజుకు రాష్ట్ర రాజకీయ, భౌగోళిక పరిస్థితులపై అవగాహన తక్కువగా ఉంటుందని చర్చ రాజకీయవర్గాల్లో ఉంది. ప్రస్తుతానికి ఎవరికి వారే తమకు పదవి వస్తుందనే ధీమాలో ఉండగా, వచ్చేవారం కొత్త చీఫ్ సెక్రెటరీ ఎవరు అనే అంశంపై క్లారిటీ వస్తుందని సీఎంవో వర్గాలు తెలిపాయి.

రామకృష్ణారావుకు బంఫరాఫర్

కేంద్ర ప్రభుత్వం చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు పదవీకాలాన్ని మరోసారి పొడిగించకపోతే ఆయన సేవలను ఇతర అవసరాల కోసం ఉపయోగించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్టు తెలిసింది. అందులోభాగంగా ఆయనకు హైదరాబాద్ మెట్రోరైలు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి కేఆర్కేకు ఆఫర్ ఇచ్చినట్టు రాజకీయవర్గాల్లో డిస్కషన్ జరుగుతున్నది. ఎల్అండ్‌టీ నుంచి మెట్రో రైలును స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతున్నది. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే మెట్రో విస్తరణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నది. అందుకు కావాల్సిన నిధుల సమీకరణ చాలా కీలకం. రామకృష్ణారావుకు చాలా కాలం పాటు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ బాధ్యతలు చూసిన అనుభవం ఉంది. కేంద్ర ప్రభుత్వంలోని అధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీనితో ఆయన ఎక్కువ వడ్డీతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం తీసుకున్న సుమారు రూ. 25 వేల కోట్ల రుణాలను తక్కువ వడ్డీకి, ఎక్కువ ఏండ్ల పాటు చెల్లించే విధంగా రీ-షెడ్యూలు చేయించడంలో కీలక పాత్ర పోషించినట్టు టాక్ ఉంది. దీనితో మెట్రో రైలు విస్తరణ కోసం కావాల్సిన నిధుల సమీకరణ ప్రక్రియలో ఆర్థిక రంగంలో అనుభవం ఉన్న రామకృష్ణారావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుదని ఆలోచనలో రేవంత్ రెడ్డి ఉన్నట్టు తెలిసింది.

# నేను హోం మినిస్టర్ కాదు.. అది క్రిమినల్స్ అదృష్టం..

## లా అండ్ ఆర్డర్‌పై పవన్ ఘాటు వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

అధికారులపై ప్రత్యేక దృష్టి: వైసీపీ పట్ల విధేయత చూపుతున్న అధికారులపై ప్రత్యేక దృష్టి పెడతానని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఇప్పటి వరకు కొన్ని అంశాల్లో మౌనం పాటించానని, ఇకపై ప్రజల ముందే తన అభిప్రాయాలను వెల్లడిస్తానని తెలిపారు. మరోవైపు.. జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు మరింత చురుకుగా వ్యవహరించాలని పవన్ సూచించారు. ప్రతి సమస్యకు తాను వ్యక్తిగతంగా వెళ్లడం సాధ్యం కాదని, ప్రజా సమస్యలపై పార్టీ ప్రజాప్రతినిధులు ముందుండాలని పిలుపునిచ్చారు.

తప్పుడు అట్రాసిటీ కేసులపై ఆందోళన

తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నిరోధించాల్సిన అవసరం ఉందని పవన్ అభిప్రాయపడ్డారు. కొన్ని కేసుల్లో రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, సుగాలి ప్రీతి, వైఎస్ వివేకానంద రెడ్డి కేసులను ప్రస్తావించారు.. లా అండ్ ఆర్డర్ బలంగా ఉండాలి.. రూల్ ఆఫ్ లా బలంగా నిలబెట్టాలి.. కులాలకు.. మతాలకు వాట్సాప్ గ్రూపులు ఉన్నప్పుడు లాండ్ ఆర్డర్ కి ఎందుకు ఉండవు? అని ప్రశ్నించారు.. సమాజాన్ని బలహీనపరచడానికి రాలేదు.. గుండాల తొక్కి నార తీస్తా.. రెండేళ్లుగా చాలా సహనంగా ఉన్నాను అన్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

# ప్రపంచానికి యోగా భారత్ ఇచ్చిన కానుక

## ప్రధాని నరేంద్ర మోడీ కీలక వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచంలోని ప్రతి ఒక్కరినీ ఏకం చేస్తుందని, మెరుగైన భవిష్యత్తు కోసం మానవతా దృక్పథం ఎంతో అవసరమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఆదివారం పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చారిత్రాత్మక రెడ్ రోడ్ వేదికగా జరిగిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' అనే స్పెషల్ థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మైదానంలో హాజరైన వేలాది మందితో కలిసి ప్రధాని మోదీ యోగాసనాలు వేశారు.

ఆ శక్తి యోగాకు ఉంది..

అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ.. యోగా అనేది కేవలం కొన్ని శారీరక వ్యాయామాల కలయిక మాత్రమే కాదని, అది మానవ ఆత్మ యొక్క అత్యున్నత అభివ్యక్తి అని ప్రధాని కొనియాడారు. అది మనసుకు, శరీరానికి మధ్య సమతుల్యతను చేకూరుస్తుందని తెలిపారు. జాతి, మత, ప్రాంతీయ బేధాలు లేకుండా ప్రపంచంలోని ప్రతి ఒక్కరినీ అనుసంధానించే అద్భుతమైన శక్తి యోగాకు ఉందని ప్రధాని పేర్కొన్నారు. విశ్వశాంతికి, మానవాళి సంక్షేమానికి ఇది ఒక వారధిలా పనిచేస్తుందని ప్రధాని అన్నారు. ఈ ఏడాది థీమ్ అయిన ఆరోగ్యకరమైన వృద్ధాప్యం గురించి చెబుతూ.. మారుతున్న జీవనశైలిలో వయసు పైబడిన వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటానికి యోగా ఎంతో దోహదపడుతుందని వివరించారు. భారతదేశ సంస్కృతిలో భాగమైన యోగాను నేడు ప్రపంచవ్యాప్తంగా వాడుకలోకి తీసుకురావడం మనందరికీ గర్వకారణమని ప్రధాని మోడీ ఆనందం వ్యక్తం చేశారు.

# 2 రోజుల పాటు ఢిల్లీలోనే సీఎం రేవంత్..

## మెట్రో, రైల్వే అంశాలపై కేంద్రంతో చర్చలు!



**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కీలకమైన మెట్రో విస్తరణ, రైల్వే పెండింగ్ అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో నేరుగా చర్చించి, సమస్యలను తేల్చుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి డిసైడ్ అయ్యారు. ఇందులో భాగంగా ఆయన రాబోయే రెండు రోజుల పాటు హస్తినలోనే పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే టార్గెట్‌గా కేంద్రం నుంచి నిధులు, అనుమతుల సాధన కోసం సీఎం ఈ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అయితే, టూర్‌కు ముందే సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక లేఖ రాశారు. ఈనెల 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలోనే అందుబాటులో ఉంటానని లేఖలో పేర్కొన్నారు. ఈ పర్యటనలో రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై చర్చించేందుకు కేంద్ర రైల్వే మంత్రితో ప్రత్యేక భేటీ ఏర్పాటు చేయించాలని, అందుకు కిషన్ రెడ్డి చొరవ చూపాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

ఐఆర్ఎఫ్సి ఫైనాన్సింగే ప్రధాన అజెండా..

సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్‌లో భాగంగా హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన నిధుల కొరతపై చర్చించనున్నారు. అదేవిధంగా ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ఫైనాన్సింగ్ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్నారు. మెట్రో ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వివిధ రైల్వే లైన్ల విస్తరణ, కొత్త రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై పూర్తి వివరాలతో కూడిన రిపోర్టును సీఎం రేవంత్, కేంద్ర మంత్రులకు అందజేయబోతున్నట్లుగా తెలుస్తోంది.

# గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం..

## వైసీపీ కొత్త వ్యూహం



**న్యూస్ డెస్క్, 21 జూన్ (తెలుగు గళం):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ సంస్థాగత బలోపేతంపై కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామ, వార్డు స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేశామని తెలిపారు. అనుబంధ విభాగాలను స్వతంత్రంగా, క్రియాశీలకంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇక, ప్రతి అనుబంధ విభాగం, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నామని సజ్జల తెలిపారు. ఆయా వర్గాల అభిప్రాయాలను సేకరించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. మళ్లీ అధికారంలోకి వస్తే ప్రతి సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని పేర్కొన్నారు.

జగన్ పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: పార్టీలో చేసే పనికి గుర్తింపు వచ్చేలా నాయకులు బాధ్యతతో వ్యవహరించాలని సజ్జల సూచించారు సజ్జల... "ఇది నా పార్టీ" అనే భావనతో ప్రతి నాయకుడు పనిచేయాలని కోరారు. ప్రజలతో మమేకం కావడం, వారి సమస్యలను తెలుసుకోవడం విజయానికి కీలకమని అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సజ్జల పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ సంక్షేమం, ప్రస్తుత ప్రభుత్వ పాలన మధ్య తేడాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. జగన్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాయని అన్నారు.

రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: ఐబీ సిలబస్, మెడికల్ కాలేజీలు, ఆరోగ్యం, విద్య రంగాల్లో వైసీపీ ప్రభుత్వం భారీ మార్పులు తీసుకువచ్చిందని సజ్జల పేర్కొన్నారు. ఐదేళ్లలో 15 ఏళ్ల అభివృద్ధిని చూపించామని అన్నారు. పార్టీ లోపాలను సరిదిద్దుకుంటూ రాష్ట్రాన్ని దేశంలో నంబర్ వన్‌గా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి..

# విధుల్లో రాణిస్తూనే పిల్లల అభ్యున్నతికై కృషి చేయాలి

## -వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ఐపిఎస్

తెలుగు గళం న్యూస్ వరంగల్ జూన్ 21



నిరంతరం విధినిర్వహణలో భాగంగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తునే తమ పిల్లల అభ్యున్నతి కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ప్రతిష్టాత్మకమై ముంబాయి ఐఐటీ కళాశాలలో అడ్మిషన్ సాధించిన ఇన్స్‌స్పెక్టర్ కుమార్తెను వరంగల్ పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సతీష్ తనయురాలు యడ్లపల్లి సాత్విక జెఈఈ మెయిన్స్ పరీక్షలో 99.65 పర్సంటైల్ సాధించగా, ఇటీవల నిర్వహించిన జె.ఈ.ఈ అడ్వాన్స్ పరీక్షల్లో రాణించి 8808 ర్యాంక్‌తో ముంబాయి ఐఐటీ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీటు సాధించడం జరిగింది. దీనితో సాత్వికను వరంగల్ పోలీస్ కమిషనర్ తన చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిపి సాత్వికతో ముచ్చటిస్తూ రాబోవు రోజుల్లో మరింత కష్టపడాల్సి వుంటుందని దేశంలోనే అత్యున్నతమైన విద్యా సంస్థలో సీటు సాధించడం గొప్ప విషయమని, ఇదే రీతిలో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని, ముఖ్యంగా నిరంతరం విధుల్లో వుండే పోలీసుల పిల్లలు గత కొద్ది సంవత్సరాలు చదువుల్లో రాణించడం, ఉన్నత ఉద్యోగాలను సాధించడం సంతోషాన్ని కలిగిస్తోందని సిపి తెలియజేసారు.

# నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

## జూన్ నుండి ఆగస్టు వరకు ప్రజా సమస్యలపై సీపీఎం పోరు యాత్ర

## సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు

జఫర్‌గడ్, జూన్ 21 (తెలుగు గళం)



ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు, రహదారులు తదితర ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో జూన్ నుండి ఆగస్టు వరకు రాష్ట్రవ్యాప్తంగా "ప్రజా సమస్యలపై పోరు యాత్ర" నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు తెలిపారు. ఆదివారం మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నక్క యాకయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాపర్తి రాజు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించడంతో పాటు పెరుగుతున్న ధరలను నియంత్రించాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 29వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను సీపీఎం బృందాలు సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను గుర్తిస్తాయని తెలిపారు. అనంతరం జూన్ 29న ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పాఠశాలల సమస్యలపై వినతిపత్రం సమర్పిస్తామని చెప్పారు. వ్యవసాయ సీజన్ నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఎంఆర్పీ ధరలకే అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు ఫర్టిలైజర్ షాపుల వద్ద కూడా సర్వేలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జూన్ 30 నుండి జులై 10 వరకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, అక్కడి సమస్యలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. జులై 11న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించి విద్య, వైద్యం రంగాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. జులై 12 నుండి ఆగస్టు చివరి వరకు గ్రామాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు, గృహాలు, ఇంటి స్థలాలు, పెన్షన్లు, లింక్ రోడ్లు, దేవాదుల ప్రాజెక్టు కాలువల పనులు, అధ్వానంగా మారిన రహదారుల మరమ్మతులు తదితర స్థానిక సమస్యలపై సర్వేలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని చెప్పారు. సీపీఎం చేపడుతున్న ఈ పోరు యాత్రకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి విజయవంతం చేయాలని రాపర్తి రాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి సోమయ్య, మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, జిల్లా కమిటీ సభ్యురాలు ఎండి షబానా, ఉప సర్పంచ్ ముక్కెర గంగరాజు, మండల కమిటీ సభ్యులు కాటా సుధాకర్, రాయపురం భిక్షపతి, యాతం సమ్మయ్య, రాపర్తి రజిత తదితరులు పాల్గొన్నారు.

# నారాయణగిరిలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



తెలుగు గళం న్యూస్ ధర్మసాగర్, జూన్ 21

ఎమ్మార్పీఎస్ ఢ ఎంఎస్పీ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చేపట్టిన "గో టు విలేజ్" కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ మండల కేంద్రంలోని నారాయణగిరి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో ఎమ్మార్పీఎస్ సంస్థను మరింత బలోపేతం చేయడం, మాదిగ సమాజ హక్కుల సాధన కోసం సమిష్టిగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. నూతన కమిటీలో వక్కల వీరయ్యను గ్రామ గౌరవ అధ్యక్షుడిగా, వక్కల అక్షిత్ మాదిగను అధ్యక్షుడిగా, చిట్యాల కృపానంద్ మాదిగను అధికార ప్రతినిధిగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా వక్కల రూసన్ మాదిగ, కొలిపాక కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా రాజరాపు ప్రశాంత్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా వక్కల రాహుల్ మాదిగ, కార్యదర్శిగా వక్కల రాకేష్, కోశాధికారిగా వక్కల అశోక్, సహాయ కార్యదర్శులుగా గొకల మహేష్ మాదిగ, వక్కల మహేందర్ మాదిగలను ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా వక్కల వెంకటేష్, వక్కల వినయ్, వక్కల సిద్దు, ఎం. శ్రీకాంత్, పీ. వికాస్, వక్కల రాములు, వక్కల రవి, వక్కల వినయ్ తదితరులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను నాయకులు అభినందిస్తూ, గ్రామ స్థాయిలో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

# వర్ధన్నపేట నియోజకవర్గం ఎస్ఐఆర్ ప్రక్రియ, పార్టీ సభ్యత్వ నమోదు అవగాహన సదస్సువిజయవంతం చేయండి

## ముఖ్య అతిథులుగా టిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నారు

## పర్వతగిరి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు

## బీఆర్ఎస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఎస్ఐఆర్ ప్రక్రియ, పార్టీ సభ్యత్వ నమోదు అవగాహన సదస్సులో

## పర్వతగిరి బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు



తెలుగు గళం న్యూస్,పర్వతగిరి, జూన్ 21 :

వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ఆదేశానుసారం నేడు మడికొండ సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో బీ.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ( కేటీఆర్ ) ముఖ్య అతిథిగా పాల్గొనున్నారని వర్ధన్నపేట నియోజకవర్గ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, బీ.ఎల్.ఏ ల సమావేశం,పార్టీ సభ్యత్వ నమోదు మరియు శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పర్వతగిరి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్వతగిరి మండల బీ.ఆర్.ఎస్ పార్టీ బీ.ఎల్.ఏ లు, సభ్యత నమోదు సభ్యులు ,సోషల్ మీడియా సభ్యులు,తాజా,మాజీ ప్రజాప్రతినిధులు మండల నాయకులు, యూత్ నాయకులు పార్టీ కార్యకర్తలు పత్రిక,మీడియా మిత్రులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఐనవోలులో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

తెలుగు గళం న్యూస్ ఐనవోలు/జూన్ 21



హనుమకొండ జిల్లా:యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం అని నినదిస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐనవోలు గ్రామ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగ శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు."ఆరోగ్యమే మహాభాగ్యం"అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ,నేటి సామాజిక ఒత్తిళ్లను తట్టుకోవడానికి శారీరక, మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని తెలిపారు. మన పూర్వీకులు మనకు ప్రసాదించిన గొప్ప వరమే యోగ అని, ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకొని ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# పర్వతగిరిలో ఘోర రోడ్డు ప్రమాదం

## విద్యార్థి మృతి.. ముగ్గురి పరిస్థితి విషమం

తెలుగు గళం న్యూస్, పర్వతగిరి, జూన్ 21



వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం విషాదాన్ని నింపింది. మోడల్ స్కూల్ సమీపంలో ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొనడంతో 16 ఏళ్ల విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం, తూరుకల సోమారం గ్రామానికి చెందిన యువకులు రెండు బైక్‌లపై ప్రయాణిస్తుండగా అతివేగం కారణంగా మోడల్ స్కూల్ వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. ఢీకొన్న ప్రభావానికి రెండు వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో పర్వతగిరికి చెందిన బుద్ధ చరణ్ (16) తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అలాగే సోమారం గ్రామానికి చెందిన ఎల్లగౌడ్, ఎండి తయ్యబ్‌తో పాటు మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పర్వతగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే గ్రామానికి చెందిన యువకులు ప్రమాదానికి గురికావడం, మైనర్ విద్యార్థి ప్రాణాలు కోల్పోవడంతో పర్వతగిరి మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# వర్ధన్నపేట నియోజకవర్గ బిఆర్ఎస్ బిఎల్ఏ లు, సోషల్ మీడియా ఇంచార్జి లు,సభ్యత్వ నమోదుశిక్షణ తరగతులు విజవంతం చేయండి

## వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్

తెలుగు గళం న్యూస్, పర్వతగిరి, జూన్ 21



నేడు సోమవారం రోజున మడికొండ దగ్గర గల సత్యసాయి కన్వెన్షన్ హాల్ యందు వర్ధన్నపేట నియోజకవర్గం బి ఎల్ ఏ ల, సర్(ఎస్ ఐ ఆర్ ),సభ్యత్వ నమోదు,మరియు సోషల్ మీడియా (యోధులకు) ఇన్చార్జిలకు శిక్షణ తరగతులు కలవు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ పత్రిక ప్రకటనలో తెలిపారు.కావున వర్ధన్నపేట నియోజకవర్గం వర్ధన్నపేట,పర్వతగిరి,ఐనవోలు , హసన్ పర్తి,వరంగల్ జిహెచ్ఎంసి పరిధిలోని గల అన్ని బూతుల బిఎల్ఏ లు,సోషల్ మీడియా ఇంచార్జి లు,సభ్యత్వ నమోదు బాధ్యులు,ఎంపీటీసీ పరిధిలో ఇన్చార్జీలు ముఖ్య కార్యకర్తలు సకాలంలో హాజరు కాగలరు. ఇది కేవలం బిఎల్ ఏ లు,సోషల్ మీడియా ఇంచార్జి లు,సభ్యత్వ నమోదు ఇన్చార్జి ల శిక్షణ తరగతులు మాత్రమే,ఇది కార్యకర్తల సమావేశం కాదు అని గమనించి సహకరించ గలరని ఆరూరి రమేష్ తెలిపారు.

# జడ్.పి.హెచ్.ఎస్ పర్వతగిరిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

## యోగ చేయడంలో మనసుకు ఎంతో ప్రశాంతత కలుగుతుంది

## ప్రధానోపాధ్యాయులు కందుకూరి నవీన్ కుమార్

తెలుగు గళం న్యూస్,పర్వతగిరి,జూన్21




రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం జడ్పిహెచ్ఎస్ పర్వతగిరి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి నేడు ఆదివారం యోగా దినోత్సవం ఘనంగా ఉపాధ్యాయ బృందం విద్యార్థులు అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా పలు యోగ శాసనాలు వేశారు. నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి నవీన్ కుమార్ మాట్లాడుతూ యోగా అనగా శరీరం మరియు మనసును ఏకం చేసే ప్రక్రియ అని, ప్రతిరోజు యోగా చేయడం వల్ల ఆరోగ్యకరమైన సంపూర్ణ జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రజలు పురాతన భారతీయ యోగాను అనుసరిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతిరోజు పిల్లలు పెద్దలు యోగ సాధన చేయడం వలన మానసిక ఒత్తిడి ఆందోళనలు తగ్గి ఏకాగ్రత పెరిగి విద్యార్థులు సదువుపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తారని తెలుపుతూ పెద్దలలో ఏకాగ్రత పెరిగి చేసే పనిని దిగ్విజయంగా పూర్తి చేస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు,ఏ మనోహర్.,వి పరశురాములు డాక్టర్ ఎం భాస్కర్ ఆర్ అశోక్ కుమార్, బి. తిరుపతి ఎస్ వెంకన్నఐ రమేష్ జి ప్రశాంత్.,జి కిషన్,అనిల్ కుమార్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని వివిధ ఆసనాలను ప్రదర్శించారు.

# ఏనుగల్లు జడ్పీ ఎచ్ ఎస్ పాఠశాల లో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఏనుగల్లు సర్పంచ్ తొర్రి పద్మ

తెలుగు గళం న్యూస్,పర్వతగిరి,జూన్ 21



12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం జడ్పీ ఎచ్ ఎస్ ఏనుగల్లు పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమనికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాయపు లింగారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా గ్రామ సర్పంచ్ పద్మ , వార్డ్ మెంబెర్స్ హాజరైనారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగారెడ్డి మాట్లాడుతూ యోగా చేయడం వలన ఆరోగ్యం గా ఉండి విద్యా వికాసనికి దోహదపాడుందని అన్నారు. సర్పంచ్ పద్మ మాట్లాడు తు...ఆరోగ్యమే మహాభాగ్యం "భారతదేశం ప్రపంచానికి అందించిన అద్భుతమైన కానుక యోగా. నిరంతర ఒత్తిడి, పరుగుల జీవితంలో శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది" అని చదువు తో పాటు యోగా చేయడం ద్వారా పిల్లలో మనో వికాసం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇట్టి కార్యక్రమం లో వార్డ్ మెంబెర్స్ పాల్గొన్నారు. యోగా కార్యక్రమం పి ఈ టి.విజయలక్ష్మి, ఉపాధ్యాయిలు బేతి ఆనందకుమార్, మజ్హూహార్, కేశవులు పాల్గొన్నారు.

# నారాయణగిరిలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

## యోగా ఆరోగ్యానికి ఎంతో మేలు - ఎంపీడీవో అనిల్ కుమార్

ధర్మసాగర్ (తెలుగు గళం) జూన్ 21:



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామపంచాయతీ పరిధిలోని అమృత సరోవర్ భాష బోయిన కుంట వద్ద యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి పుట్ట రేణుక కుమార్ అధ్యక్షతన,ధర్మసాగర్ మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో అనిల్ కుమార్ మాట్లాడుతూ. యోగా మనిషి జీవితంలో ఆరోగ్యకరమైన మార్పులను తీసుకువస్తుందని అన్నారు. యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత,ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతిరోజూ యోగా సాధన చేయాలని సూచించారు. యోగ కార్యక్రమంలో యోగ శిక్షకుడు ప్రఫుల్ పాల్గొని గ్రామస్తులకు వివిధ యోగాసనాలు,ప్రాణాయామం, శ్వాస సంబంధిత వ్యాయామాలను చేయించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి పుట్ట రేణుక కుమార్,వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థాయి అధికారులు,గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనగాం సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం




**తెలుగు గళం న్యూస్ జనగాం/జూన్ 21**

మేరా యువ భారత్ ఆధ్వర్యంలో, మై భారత్ జిల్లా యువజన అధికారి భూక్య సంజీవ్ మరియు సూపరింటెండెంట్ బానోత్ దేవీలాల్ ఆదేశాల మేరకు జనగాం జిల్లా సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మేరా యువ భారత్ ప్రోగ్రాం ఆర్గనైజర్ వెల్దండ రాజేందర్ రాము, అధ్యాపక-అధ్యాపకేతర బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల పీడీ మమత విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, "యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చు. ప్రతి విద్యార్థి రోజూ ఉదయాన్నే యోగాసనాలు వేయడం అలవాటు చేసుకోవాలి" అని తెలిపారు.

## భీమారంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన




**తెలుగు గళం న్యూస్ హన్మకొండ/జూన్ 21**

55వ డివిజన్ భీమారంలో పలు అభివృద్ధి పనులకు వర్ధన్నపేట శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. కాకతీయనగర్‌లో 90 లక్షలతో చేపట్టనున్న రోడ్డు పనులకు, చాణక్యపురి కాలనీలో 19.80 లక్షలతో నూతన రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి. భీమారం డివిజన్‌ను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తాను అని అన్నారు. అనంతరం భీమారం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన 'ఇందిరా మహిళా శక్తి' చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళా సంఘాల సభ్యులకు చీరలు పంపిణీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మహిళల ఆర్థిక, విద్యా, సామాజిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. మహిళల అభ్యున్నతే రాష్ట్రాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు గడ్డం శివరాం ప్రసాద్, ఎర్రగట్టుగుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ మర్కా రాజు, జిల్లా కార్యదర్శి రణధీర్, నాయకులు అరుణ్, ఆకుల కుమార్, కార్యకర్తలు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా నీట్ పరీక్షల నిర్వహణ

### 12 కేంద్రాల్లో విజయవంతంగా పరీక్షలు

### -- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**తెలుగు గళం న్యూస్ హనుమకొండ, జూన్ 21**

హనుమకొండ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 12 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 4,196 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించగా, 3,764 మంది హాజరయ్యారు. 432 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సందర్భంగా హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్రానికి కేటాయించిన అభ్యర్థుల సంఖ్య, హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి అధికారులతో మాట్లాడారు. నీట్ పరీక్షల నిర్వహణకు ముందస్తుగా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పరీక్షలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సాఫీగా పూర్తయ్యాయని పేర్కొన్నారు. పరీక్షల విజయవంతమైన నిర్వహణకు సహకరించిన అధికారులు, పోలీసు సిబ్బంది, వివిధ శాఖల సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

## నల్లబెల్లి జెడ్పీఎస్ఎస్‌లో ఘనంగా యోగా దినోత్సవం




**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/జూన్ 21**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యోగ నేటి జీవన విధానంలో భాగం కావాలి. ప్రతి వ్యక్తి ఆరోగ్యవంతంగా జీవించడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుంది. భారతదేశ ప్రాచీన సంపద అయిన యోగ నేడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింద. అని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్యాల రమేష్ బాబు విద్యార్థులకు యోగాసనాలు నేర్పిస్తూ, స్వయంగా ఆసనాలు వేసి వారికి స్ఫూర్తిగా నిలిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల దేవేందర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కడియం శ్రీహరి మనవరాళ్ల సారె వేడుకలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**తెలుగు గళం న్యూస్ హనుమకొండ/జూన్ 21**

స్టేషన్ ఘన్‌పూర్ శాసనసభ్యులు, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మనవరాళ్ల సారె వేడుక ఘనంగా జరిగింది. కడియం శ్రీహరి కుమార్తెలు రమ్య-శేష దంపతుల కుమార్తె అనన్య, దివ్య-రాఘవ్ దంపతుల కుమార్తె అక్షరల సారె వేడుకకు వర్ధన్నపేట శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరయ్యారు. ఈ వేడుకలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చిన్నారులు అనన్య, అక్షరలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ సమాజం ఉన్నంతవరకు ప్రొఫెసర్ జయశంకర్ శ్రేష్ఠుడే

### :కంటెస్టెడ్ ఎమ్మెల్సీ, ప్రముఖ సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు

### కోహెడలో ఘనంగా ఆచార్య జయశంకర్ 15వ వర్ధంతి వేడుకలు



**తెలుగు గళం న్యూస్ సిద్దిపేట హుస్నాబాద్ కోహెడ**

తెలంగాణ స్వరాష్ట్ర సిద్ధాంతకర్త, మలిదశ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ సేవలు, ఆయన చేసిన పోరాటాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ప్రముఖ సామాజిక కార్యకర్త, కంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ 15వ వర్ధంతి వేడుకలను ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండల కేంద్రంలో పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి చేతులు జోడించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిడిశెట్టి రాజు మీడియాతో మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక శ్వాసగా, జీవితకాలం మొత్తం ఉద్యమానికే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల గుండెల్లో ఆయన నిరంతరం సజీవంగానే ఉంటారన్నారు. తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో ఆయా రంగాల మేధావులను, ప్రభుత్వ ఉద్యోగులను, వ్యాపార వర్గాలను మరియు విద్యార్థి లోకాన్ని ఒకే తాటిపైకి తీసుకువచ్చి, వారిలో స్వరాష్ట్ర ఆకాంక్షను రగిల్చడంలో జయశంకర్ పోషించిన పాత్ర అద్వితీయమైనదని రవి రాజు గుర్తుచేశారు. నాడు జయశంకర్ సార్ కలలుగన్న సామాజిక తెలంగాణ ఆశయాలు, భవిష్యత్తు అజెండాలు నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో ఒక్కొక్కటిగా నెరవేరుతున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జయశంకర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ మహోన్నత నివాళి కార్యక్రమంలో మహిళా సంక్షేమ సంఘం జిల్లా అగ్ర నాయకురాలు చిట్యాల భాగ్యలక్ష్మి, ప్రముఖ మహిళా ప్రతినిధులు జెరిపోతుల పద్మ, తైదల రాజేశ్వరి, రేణుక, పి. మాధవి, అక్షరలతో పాటు సామాజిక శ్రేణులు ఎస్. రమేష్, సంపత్, శంకర్, వివిధ రంగాల ప్రముఖులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ సేవలను స్మరించుకున్నారు.

## నిత్య యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం

### :భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

### ఇల్లందు క్లబ్‌లో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహణ

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

భారతదేశం యావత్ ప్రపంచానికి ప్రసాదించిన అత్యంత అమూల్యమైన ఆరోగ్య సంపద, జీవన విధానం ఒక్క యోగా మాత్రమేనని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 పురస్కరించుకుని ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారిక వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం "యోగ ఫర్ హెల్తీ ఏజింగ్" (ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా) అనే ప్రత్యేక ఇతివృత్తంతో (థీమ్) ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓలు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్వయంగా వేదికపై ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పలు సంక్లిష్టమైన యోగాసనాలు వేసి అందరిలోనూ ఉత్సాహం నింపారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మారుతున్న ప్రస్తుత ఆధునిక జీవనశైలి, గజిబిజి ఆహారపు అలవాట్ల వల్ల ప్రతి ఒక్కరూ తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతూ చిన్న వయస్సులోనే దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనిషి జీవితంలో సంపాదించే అన్ని ఆస్తుల కంటే అత్యంత విలువైనది ఆరోగ్యం మాత్రమేనని, ఆరోగ్యం క్షీణిస్తే జీవితంలో ఎంతటి ఉన్నత శిఖరాలను అధిరోహించినా అది పూర్తిగా వ్యర్థమని స్పష్టం చేశారు. యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అది మానసిక ప్రశాంతతను, క్రమశిక్షణను చేకూర్చే ఒక పవిత్ర మార్గమని








పేర్కొన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో ఒక అంతర్భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఎస్పీ నరేష్ కుమార్ మాట్లాడుతూ.. నిత్యం యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఏకాగ్రత, పనిలో నైపుణ్యం అద్భుతంగా పెరుగుతాయని, ముఖ్యంగా ఒత్తిడితో కూడిన విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి, అన్ని వయస్సుల వారికి ఇది ఎంతగానో మేలు చేస్తుందని వివరించారు. జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. ఆయుష్ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం, హోమియోపతి సేవల ప్రాముఖ్యతను వివరించారు. ఈ ఏడాది థీమ్ ప్రకారం యోగా ద్వారా వృద్ధాప్యంలో వచ్చే శారీరక మార్పులను తట్టుకుని దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ప్రశాంతమైన జీవనం సాగించవచ్చన్నారు. ఈ క్రమంలో ప్రముఖ యోగా గురువు కుమార్ వేదికపై ఆసనాలు, ప్రాణాయామం చేయిస్తూ, ఏ ఆసనం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయో ప్రత్యక్షంగా వివరించారు. ఈ ఉన్నత స్థాయి వేడుకల్లో డిప్యూటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె. కృష్ణవేణి, కొడవటంచ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మెడికల్ ఆఫీసర్ కం కన్వీనర్ డాక్టర్ ప్రేమ్ సాగర్, డిప్యూటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ ఖన్నా, డాక్టర్ సదానందం, డాక్టర్ అజయ్ తదితర ప్రముఖ ఆయుష్ వైద్య బృందం, అడ్వకేట్ మాతంగి రమేష్ బాబుతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయుష్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రేగొండలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

### ప్రతిరోజూ యోగా సాధనతో ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం:బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్ రెడ్డి



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ రేగొండ మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక యోగా ప్రదర్శన కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో చిన్నపిల్లలు, విద్యార్థులు పాల్గొని వివిధ రకాల ఆసనాలను ఉత్సాహంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిశిధర్ రెడ్డి అధికారికంగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి యోగా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా అందరితో కలిసి యోగాసనాలు వేసి, యోగా విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా నిశిధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచ దేశాలకు అందించిన అత్యంత విలువైన అమూల్యమైన కానుక యోగా అని కొనియాడారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల ఆధునిక జీవన విధానంలో ప్రతి ఒక్కరూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, నిత్యం యోగా సాధన చేయడం వల్ల శరీరానికి, మనసుకు, మెదడుకు ఎనలేని ఆహ్లాదం, ప్రశాంతత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. యోగాను కేవలం ఒక రోజు వేడుకగా కాకుండా, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. క్రమం తప్పకుండా యోగా, ప్రాణాయామం చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి ఎలాంటి భయంకరమైన వ్యాధులు దరిచేరవని, మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం సిద్ధించి



ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని రవి రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నతనం నుంచే పిల్లలకు యోగా అలవాటు చేయడం వల్ల వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి అద్భుతంగా పెరుగుతాయని సూచించారు. ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కన్వీనర్ దేశెట్టి గోపాల్, పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మోత్కుపల్లి బుచ్చిరెడ్డి, గన్రెడ్డి లింగారెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండేల రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిఫ్, రేగొండ మండల కన్వీనర్ మేకల రవీందర్, బూత్ అధ్యక్షులు నేరెళ్ల శంకర్, మాచర్ల రఘుతో పాటు పలువురు వార్డు ప్రతినిధులు, పౌరులు, బాలబాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ 12 ఏళ్ల సుపరిపాలన దేశ చరిత్రలో సువర్ణాక్షరాల లిఖితం

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్ రెడ్డి

### రావులపల్లి రామాలయ ఆవరణలో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహణ



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకున్న శుభసందర్భాన్ని పురస్కరించుకుని జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ రేగొండ మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్ పర్యవేక్షణలో, మండల కేంద్రంలోని చారిత్రాత్మక రావులపల్లి రామాలయ గుడి ఆవరణలో ఆదివారం భారీగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిశిధర్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కన్వీనర్ దేశెట్టి గోపాల్ అధికారికంగా హాజరై, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మొదటి మొక్కను నాటారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ఆలయ ప్రాంగణమంతా పచ్చదనం పెంపొందించేలా పలు రకాల నీడను ఇచ్చే, పూల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గత 12 ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోడీ అందిస్తున్న అవినీతి రహిత, పారదర్శక పాలన ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్టలను హిమాలయాలంత ఎత్తుకు తీసుకెళ్లిందని కొనియాడారు. పేద, ఎలిక వర్గాల సంక్షేమమే ధ్యేయంగా దేశంలో అనేక విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టి, అంతర్జాతీయ వేదికలపై దేశాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత మోడీకే దక్కుతుందని స్పష్టం చేశారు. ఈ సుపరిపాలన ఉత్సవాల్లో భాగంగా పర్యావరణాన్ని కాపాడుకోవాలనే ఉన్నత ఆశయంతో దైవసన్నిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల రాజు, జిల్లా సీనియర్ నాయకులు మెత్కుపెల్లి బుచ్చిరెడ్డి, గన్రెడ్డి లింగారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలీఫ్, రేగొండ మండల నాయకులు మేకల రవీందర్, బూత్ అధ్యక్షులు నేరెళ్ల శంకర్, మాచర్ల రఘుతో పాటు పలువురు బీజేపీ మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.